సాక్షి ఖమ్మం

గురువారం । 23 । నవంబర్ । 2023



నైపుణ్యాలు మెరుగుపరిచేందుకే...

విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు బాలల సైన్స్ కాంగ్రెస్ దోహద పడుతుందని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. 10లో



ఈవీఎంతో ఈజీ..

ఈవీఎంలు అందుబాటులోకి వచ్చాక పోలింగ్ ప్రక్రియ అటు ఓటర్లు, ఇటు యంత్రాంగానికి సులభంగా మారింది. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం కంటే సాయంత్రం తర్వాత చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

25న మధిరకు ఖర్గే, ప్రియాంకగాంధీ

మధిర: సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క తరఫున ఈనెల 25న మధిరలో ప్రచార బహిరంగ సభ ఏర్పాటుచేశారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకు మధిరలోని పీవీఆర్ గార్డెన్స్ ఎదురు స్థలంలో నిర్వహించే సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ నేత ప్రియాంకా గాంధీ పాల్గొంటారు. ఈమేరకు కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

స్కేటింగ్ పోటీల్లో చిన్నారుల సత్తా



రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ఈ నెల 21, 22వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మం సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్, సాంబప్రసాద్, విశాలాక్షి, అమూల్య, హలయ, నందగోపాల్, సాంబశివారెడ్డి, ఫాల్గుణ, వ్యూహిత, గీతిక్‌నాయక్, గౌతమ్‌రమేశ్ తొమ్మిది బంగారు, ఏడు రజత, ఏడు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. అలాగే, డిసెంబర్ 15వ తేదీ నుంచి చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు సాంబప్రసాద్, విశాలాక్షి, నందగోపాల్, హలయ, సాంబశివారెడ్డి, గీతికనాయక్ ఎంపికయ్యారు. ఈ మేరకు క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, స్కేటింగ్ కోచ్ కె.సురేశ్ అభినందించారు.

రేపటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24, 25వ తేదీల్లో ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ నిర్వహించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని తొమ్మిది కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. కాగా, పోటీల ప్రారంభ సమావేశానికి కొత్తగూడెం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు, మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రాజ్‌కుమార్ అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించనుండగా, ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించనున్నట్లు డైరెక్టర్ హృదయ్‌మీనన్ తెలిపారు. హైస్కూల్ విద్యార్థులకు తెలుగు, హిందీ, సోషల్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 25వ తేదీలోగా kpmschoolkhammam@gmail.com మెయిల్‌కు దరఖాస్తులు పంపించాలని, పూర్తి వివరాలకు 94405 25093 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రశాంతంగా ఎన్నికలు



సమీక్షలో మాట్లాడుతున్న దీపక్ మిశ్రా, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, అధికారులు

- ఆ వాతావరణం కల్పించాలి
- రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర పోలీస్ ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా సూచించారు. బుధవారం ఖమ్మం వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి, కానారామ్, సతేంద్రసింగ్, పోలీస్ పరిశీలకులు బ్రిజేష్ కుమార్‌రాయ్, మంజునాథ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో సమావేశమయ్యారు. ఈసందర్భంగా హాజరైన నోడల్ అధికారులు, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

కీలకంగా శాంతిభద్రతలు

పోలింగ్ ముగిసే వరకు శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజలకు భరోసా కల్పించడం కీలకమని దీపక్‌మిశ్రా తెలిపారు. ఇందుకోసం కేంద్ర బలగాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలని సూచించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద 144 సెక్షన్ విధించి, సరైన గుర్తింపు కార్డులు ఉన్నవారినే అనుమతించాలన్నారు. అలాగే, పోలీసులు కానీ ఇతర శాఖల అధికారులు కానీ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఇక ఈవీఎంలను కేంద్రాలకు చేర్చడం, ఓటింగ్ ముగిశాక స్ట్రాంగ్ రూంలకు తరలించే సమయాన జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అలాగే, హోమ్ ఓటింగ్, పోస్టల్ ఓటింగ్ షెడ్యూల్‌ను అభ్యర్థులు, ఏజెంట్లకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇంకా వెబ్ కాస్టింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి, పోలింగ్ సరళిని నిరంతరం గమనించేందుకు కంట్రోల్ రూమ్‌ను పటిష్టం చేయాలని దీపక్‌మిశ్రా ఆదేశించారు.

నిరంతరం తనిఖీలు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. జిల్లాలో 23 ఎంసీసీ, 17 ఎస్ఎస్‌టీ, 20 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రూ.8,57,45,997 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

396 సమస్యాత్మక కేంద్రాలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 12,16,796 మంది ఓటర్లు ఉండగా, 1,456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 396 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే, యూపీఐ లావాదేవీలపై నిఘా వేశామని, బ్యాంకుల నుండి నివేదికలు తీసుకుని విచారణ చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి



అమ్మపాలెంలో అధికారులతో సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

కొణిజర్ల: పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున అన్ని కేంద్రాల్లో కనీస మౌళిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కొణిజర్ల మండలంలోని రాజ్యాతండా, అమ్మపాలెంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసిన భవనాలకు పెయింటింగ్ వేయించాలని, మరుగుదొడ్లలో నీటి వసతి పునరుద్ధరించాలని సూచించారు. అలాగే, సరైన వెలుతురు వచ్చేలా లైట్లు ఏర్పాటుచేయాలన్నారు. ఆయా పనులను యుద్ధప్రతిపాదికన పనులు పూర్తిచేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రమౌళి, ఈఈ వెంకటరెడ్డిని ఆదేశించారు. ఆతర్వాత పోల్ చీటీల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. విద్యాశాఖ ఈఈ నాగశేషు, డీఈ వైకుంఠాచారి, తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, ఎంపీఓ ప్రభాకర్ రెడ్డి, పీఆర్ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కొణిజర్లలోని ప్రొద్దుటూరు క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్టును కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈ వాహనాల తనిఖీ వివరాలు, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఏ ఒక్క వాహనాన్ని వదలకుండా తనిఖీ చేయాలని ఉద్యోగులకు సూచించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

ఖమ్మంసహకారనగర్: శాసనసభ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సూచించారు. ఢిల్లీ నుంచి బుధవారం ఆయన అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు గుర్తింపు కార్డులు, సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎంల కమీషనింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పోలింగ్ సజావుగా జరిగేలా ఎంపిక చేసిన ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామని, 90 శాతం మందికి ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఈవీఎంల కమీషనింగ్, ర్యాండమైజేషన్ చేపట్టి నియోజకవర్గాలకు కేటాయించామని చెప్పారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, డీసీఓ విజయకుమారి, డీఈఓ సోమశేఖరశర్మ, సీపీఓ ఏ.శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ హరికిషన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మీనన్, రంజిత్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు

- సీపీఐ జాతీయ నాయకుడు వెంకటరెడ్డి



సభలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

నేలకొండపల్లి: తెలంగాణకు విముక్తి కల్పించేలా సీఎం కేసీఆర్‌ను గద్దె దించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. నేలకొండపల్లి మండలంలోని మంగ్రాజుపల్లి, బోదులబండ తదితర గ్రామాల్లో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ గొప్పగా చెప్పుకునే మేడిగడ్డ కుంగిపోగా, బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి బయటపడిందని తెలిపారు. ధరణి పోర్టల్‌తో లాభం బీఆర్ఎస్ పార్టీ నేతలకే జరిగిందని ఆరోపించారు. నియంతృత్వ పాలనను అంతం చేసేలా పాలేరులో పొంగులేటి, కొత్తగూడెంలో కూనంనేని సాంబశివరావుతో పాటు ఇతర చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

Interview



ఔట్‌డేట్ కాదు.. అప్‌డేట్ కావాలి

- బీఆర్ఎస్ హయాంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి
- మళ్లీ గెలిపిస్తే ఇంకో రూ.30 వేల కోట్ల నిధులు తీసుకొస్తా
- కాంగ్రెస్ హయాంలో ఖమ్మంను నిర్లక్ష్యం చేశారు
- 40 ఏళ్ల రాజకీయాల్లో 'తుమ్మల' ఏం చేశాడో చెప్పాలి
- ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'నా హయాంలో ఖమ్మం అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారించా. ప్రజలకు అందుబాటులో ఉన్నా.. మీ ఇంటి ముందు అభివృద్ధి కనపడుతోంది.. కంటి ముందే అభ్యర్థి ఉంటున్నాడు. నేను ఇక్కడి భూమి పుత్రుడిని. మరోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయం. ఇక్కడ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉంటే ఇంతకన్నా గొప్పగా అభివృద్ధి జరుగుతుంది. గత 76 ఏళ్లతో పోలిస్తే ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకుని ప్రజలు నన్ను ఆశీర్వదించి మరోమారు గెలిపించాలి. ప్రజలు అప్‌డేటెడ్ వర్షన్‌ను ఎంచుకోవాలే తప్ప ఔట్‌డేటెడ్ వర్షన్‌తో ఉపయోగం ఉండదు'. అని ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 'సాక్షి'కి బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు పువ్వాడ మాటల్లోనే..

ప్రభుత్వంలో మరింత ప్రాముఖ్యత

నేను చేసిన అభివృద్ధి కొనసాగాలంటే నాకు ఓటు వేయాలి. ఈ అభివృద్ధిని ప్రజలు ఆపుకుంటారా? రాష్ట్రంలో కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుంది. ఖమ్మం కార్పొరేషన్‌లో మా పాలకవర్గమే ఉంది. మధ్యలో కీలకమైన ఇరుసుగా శాసనసభ్యుడు మీవాడు లేకపోతే పైనుంచి కిందకు నిధులు ఎలా వస్తాయి? నిధులు రావాలంటే ప్రభుత్వంలో కీలకంగా ఉండాలి. వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో మనకు అవకాశం వస్తుంది కదా.. ఇప్పుడు మంత్రిగా ఉన్నా.. కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రిగా ఉంటే కేసీఆర్ తర్వాత కేటీఆర్ ప్రభుత్వంలోనూ మరింత ప్రాముఖ్యత దక్కుతుంది. ఇప్పుడు రూ.3 వేల కోట్లు తీసుకొస్తే రేపు రూ.30 వేల కోట్లు కూడా తీసుకురాగలుగుతా.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి పరుగులు

ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్ వచ్చాకే అభివృద్ధి జరిగింది. నా హయాంలో ఐదేళ్లలో రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశా. ఖమ్మం గతంలో ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉందో చూస్తే తెలుస్తుంది. నియోజకవర్గాన్ని రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేశాం. గోళ్లపాడు చానల్‌ను ప్రక్షాళన చేశాం. మురుగునీరు, వర్షపునీరు వెళ్లేందుకు డ్రెయినేజీ నిర్మించాం. అందమైన పార్కులు ఏర్పాటుచేశాం. ఇందుకు రూ.110 కోట్లు వెచ్చించాం. రూ.50 కోట్లతో లకారం ట్యాంక్‌బండ్‌ను తీర్చిదిద్ది, సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించాం.

అధునాతన బస్టాండ్..

ఖమ్మంలో రూ.30 కోట్లతో అధునాతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాం. రూ.21 కోట్లతో కేఎంసీ కార్యాలయం, రూ.17.5 కోట్లతో సమీకృత మార్కెట్, రూ.9 కోట్లతో వైకుంఠధామాలు, రూ.200 కోట్లతో మిషన్ భగీరథ పథకం పనులు, రూ.7.8 కోట్లతో వీధిదీపాలు ఏర్పాటు చేశాం. నియోజకవర్గవ్యాప్తంగా రూ.347 కోట్లతో రహదారులు, రూ.448 కోట్లతో డ్రెయినేజీల నిర్మాణం పూర్తయింది. రూ.27.5 కోట్లతో ఐటీ హబ్ ఏర్పాటుచేశాం. రూ.5కోట్లతో పబ్లిక్ టాయిలెట్లు, రూ.70 లక్షలతో బస్తీ దవాఖానాలు ఏర్పాటయ్యాయి. చెబుతూ పోతే లెక్కలేనంత అభివృద్ధి జరిగింది.

మరిన్ని ప్రణాళికలు రెడీ

ఖమ్మంను మరింత అభివృద్ధి చేస్తాం. ఫ్లై ఓవర్లు, సైకిల్ ఓవర్లు వస్తాయి. హైదరాబాద్‌కు దీటుగా ఖమ్మంను అభివృద్ధి చేస్తా. ఇప్పటికే రూ.1,160 కోట్ల విలువైన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. రూ.180 కోట్లతో మున్నేరుపై సస్పెన్షన్ బ్రిడ్జి, రూ.690 కోట్లతో మున్నేరుకు రిటైనింగ్ వాల్ నిర్మాణమే కాక రూ.100 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఇతర పనులు చేపట్టబోతున్నాం. రూ.190 కోట్ల అమృత్ పథకం నిధులను లకారం చెరువు వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాలకు కేటాయించారు. ఈ పనులు ముందుకు కొనసాగించడంతోపాటు మరిన్ని నిధులను ఖమ్మంకు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలన్నదే నా సంకల్పం.

కాంగ్రెస్ అభ్యర్థి చేసిందేం లేదు..

గత 76 ఏళ్లలో ఎక్కువ కాలం కాంగ్రెస్ పార్టీ పాలించింది. ఖమ్మంను కాంగ్రెస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి గతంలో మంత్రిగా పనిచేసినా ఖమ్మంకు చేసిందేమీ లేదు. కనీసం ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాల తీసుకురాలేకపోయారు. పరిశ్రమల పరిస్థితీ అంతే. సాగునీటి మంత్రిగా పనిచేసినా గోదావరి జలాలు తీసుకురాలేదు. 40 ఏళ్లలో చేయకపోగా, ఇప్పుడు కాళ్లు కడుగుతానని మాట్లాడుతున్నాడు. ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరి జలాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటేనే ఆయన ఈ బాకా ఊదుతున్నాడు.

సీతాకోకచిలుకగా మార్చా..

స్థానికతే నా ప్రధాన బలం కాగా, ఇంటి ముందు అభివృద్ధి... కంటి ముందు అభ్యర్థి నా ట్యాగ్ లైన్. నేను అందుబాటులో ఉండడాన్నే చెబుతూ ప్రజల్లోకి వెళ్తున్నా. నేను ఇక్కడి భూమిపుత్రుడిని. అజయ్‌కుమార్ 'వాడవాడలా పువ్వాడ' పేరిట తిరగబట్టే గొంగళి పురుగులా ఉన్న ఖమ్మం సీతాకోక చిలుకలా మారింది. మంత్రి అనే వాడు ప్రజలతో మమేకమయ్యేలా పనిచేయాలి. మోటార్‌సైకిల్ వేసుకుని లబ్ధిదారులవద్దకే వెళ్లి చెక్కులు ఇచ్చాం. అలాగే మా దగ్గరికి ఎవరొచ్చినా ఏమీ ఆశించకుండా కొన్ని వేల మందికి సాయం చేశా. కరోనా, వరదల సమయాల్లో నా సేవ ఏమిటో ప్రజలకు తెలుసు. వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగా నేను ఏ రకంగా స్పందించానన్నది తెలుసు. అదే నా బలం.

ఆమెకు.. అవకాశమేది?!



ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలు.. నియోజకవర్గాల వారీగా చూసినా, మొత్తంగా చూసినా మహిళా ఓటర్లే అగ్రభాగం! తద్వారా అభ్యర్థుల గెలుపోటముల్లో అతివలే కీలక పాత్ర పోషించే అవకాశముంది. అయితే, పోటీపరంగా పరిశీలిస్తే మాత్రం మహిళలు అట్టడుగున ఉండడం గమనార్హం. పది స్థానాల్లో కలిపి ఈసారి ఎన్నికల్లో 214 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా.. ఇందులో కేవలం 27 మంది మహిళలే ఉన్నారు. 2018 ఎన్నికల్లో 12 మంది మహిళలు పోటీచేయగా.. ఈసారి సంఖ్య పెరగడం ఒకటే కాస్త సంతోషం కలిగించే విషయమని చెప్పాలి.

– సాక్షి నెట్‌వర్క్

- ఉమ్మడి జిల్లా ఓటర్లలో మహిళలే అత్యధికం
- ఎన్నికల బరిలో మాత్రం వారి స్థానం అంతంతే
- ప్రధాన పార్టీల నుంచి ఇద్దరికే టికెట్
- పది స్థానాల్లో 214 మంది పోటీ.. 27 మందే మహిళలు
- గత ఎన్నికలతో పోలిస్తే మెరుగుపడినా స్వతంత్రులే ఎక్కువ

అతి తక్కువ...

పది స్థానాల్లో కలిపి 214 మందిలో 27 మంది మహిళలు ఉండగా, ఇందులో ప్రధాన పార్టీల నుంచి అతి తక్కువ మందికే స్థానం దక్కింది. ఇల్లెందు బరిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బానోతు హరిప్రియ, సత్తుపల్లిలో కాంగ్రెస్ నుంచి మట్టా రాగమయికి మాత్రమే అవకాశం లభించింది. మిగతా వారు ఇతర పార్టీల నుంచి, ఇంకొందరు స్వతంత్రులుగా బరిలో ఉన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె అనురాధ కూడా ఇల్లెందులో స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తున్నారు.

సగానికి పైగా వారే..

ఈనెల 11వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం పది నియోజకవర్గాల్లో కలిపి 21,83,235 మంది ఓటర్లు ఉన్నట్లు తాజా జాబితా ద్వారా వెల్లడైంది. ఇందులో మహిళా ఓటర్లు 11,22,203 మంది, పురుషులు 10,60,910 మంది ఉన్నారు. ఇందులో ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 12,16,796 మంది కాగా, వీరిలో మహిళలు 6,27,553 మంది, పురుషులు 5,89,165 మంది ఉన్నారని వెల్లడించారు. అలాగే, భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 9,66,439 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 4,94,650 మంది, పురుషులు 4,71,745 మంది ఉన్నట్లు వెల్లడైంది. ఇలా నియోజకవర్గాల వారీగా, జిల్లా వారీగా, ఉమ్మడి జిల్లా వారీగా చూసినా మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్నప్పటికీ వారు చట్టసభల్లో అడుగుపెట్టేందుకు మెరుగైన అవకాశాలు మాత్రం దక్కడం లేదు.

స్థానిక సంస్థల్లో మెరుగైన స్థానం

స్థానిక సంస్థలైన ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. దీంతో రిజర్వేషన్ల ఆధారంగా ఆయా స్థానాల నుంచి మహిళా ప్రజాప్రతినిధులు ఎన్నికవుతున్నారు. అంతేకాక జనరల్ స్థానాల నుంచి కూడా పలువురు మహిళలు పోటీపడి విజయం సాధించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా పునుకొల్లు నీరజ, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాపు సీతాలక్ష్మి, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మొండితోక లత ఎన్నియ్యారు. ఇంకా పలువురు ఎంపీపీలుగా, సర్పంచ్‌లుగా పాలనలో సత్తా చాటుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కానీ చట్టసభల వరకు వచ్చేసరికి ఆ స్థాయిలో మహిళలకు ప్రాతినిధ్యం దక్కడం లేదు.

ఇప్పటివరకు ఐదుగురే...

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ 1952లో మొదలుకాగా, ఇప్పటివరకు పదిహేను సార్లు ఎన్నికలు జరిగాయి. అయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్థానాల నుంచి ఇన్నేళ్లలో కేవలం ఐదుగురు మహిళలే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1957లో ఖమ్మం ద్విసభ్య స్థానానికి జరిగిన ఎన్నికల్లో తేళ్ల లక్ష్మీకాంతమ్మ రెండో అభ్యర్థిగా, 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ, 2009లో భద్రాచలం నుంచి కుంజా సత్యవతి, వైరా నుంచి బి.చంద్రావతి గెలిచారు. గత ఎన్నికల్లో ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ విజయం సాధించారు. ఇక ఈసారి హరిప్రియ ఇల్లెందు నుంచి, రాగమయి సత్తుపల్లి నుంచి పోటీ పడుతుండగా, ఇంకో 25 మంది మహిళా అభ్యర్థులు వివిధ స్థానాల్లో పోటీకి దిగారు. ఇందులో ఎంత మంది విజయం సాధిస్తారో, తమ గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తారో వేచి చూడాల్సిందే!

నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థులు

నియోజకవర్గం	మొత్తం	మహిళలు
ఖమ్మం	32	06
పాలేరు	37	02
మధిర	15	00
సత్తుపల్లి	23	05
వైరా	12	00
పినపాక	18	02
ఇల్లెందు	20	04
కొత్తగూడెం	30	01
అశ్వారావుపేట	14	03
భద్రాచలం	13	04
మొత్తం	214	27

ప్రత్యర్థులు పక్కపక్కనే..



ప్రచారంలో విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్న ఖమ్మం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పువ్వాడ అజయ్‌కుమార్, తుమ్మల నాగేశ్వరరావు ఎదురుపడ్డారు. ఖమ్మం 22వ డివిజన్‌లో నాగేశ్వరరావు ప్రచారం చేస్తుండగా.. 23వ డివిజన్‌లో ప్రచారానికి వెళ్తున్న పువ్వాడ వాహనం అక్కడికి చేరుకుంది. దీంతో రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

– ఖమ్మంమయూరిసెంటర్

బుడ్డోడి అభిమానం



సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య బుధవారం పెనుబల్లి మండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ ప్రచారానికి ఓ కార్యకర్త కుమారుడు బీఆర్‌ఎస్ గుర్తుతో ఉన్న దుస్తులు ధరించి రావడమే కాక వాహనంపై సండ్ర ప్రసంగిస్తున్నంత సేపు కారు బొమ్మను ప్రదర్శించడం ఆకట్టుకుంది. – సత్తుపల్లి

అందంగా తీర్చిదిద్దుతా...



భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ప్రచారం చేశారు. ఆయన షాపుల్లోకి వెళ్లి వ్యాపారులు, వినియోగదారులను ఓటు అభ్యర్థించారు. ఇందులో భాగంగా హోటళ్లలో పెసరట్టు వేయడంతో పాటు ఇస్త్రీ చేయడమే కాక ఆటో నడిపారు. అలాగే, బార్బర్ షాప్‌లో ఓ వ్యక్తికి షేవింగ్ చేసి తనను గెలిపించాలని కోరారు.

– భద్రాచలం

మీ ఓటు మాకే...



కొత్తగూడెం నుంచి పలు పార్టీల మద్దతుతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్నారు. మరోపక్క బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే, సీపీఐ నాయకులు ఆరో వార్డ్‌లో ప్రచారం చేస్తూ సీతాలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెను కూడా ఓటు అభ్యర్థించారు.

– సింగరేణి(కొత్తగూడెం)

సమయం లేదు మిత్రమా..



ఇల్లెందు నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉండటంతో అభ్యర్థులు ఉరుకులు, పరుగులపై ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య కామేపల్లి మండలంలో బుధవారం ప్రచారం చేయగా స్థానిక హోటల్‌లో టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సమయం లేదు.. రెండు ఇడ్లీలు చాలు' అంటూ త్వరగా ముగించి ప్రచారంలో నిమగ్నమయ్యారు.

–కామేపల్లి

ఈవీఎంతో ఈజీ..

ఈవీఎం.. వీవీప్యాట్.. నోటా వంటి సౌకర్యాలతో కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతికత, పారదర్శకతతో కూడిన సంస్కరణలు ప్రవేశపెడుతోంది. 2009 సార్వత్రిక ఎన్నికల నుంచి వీటిని వినియోగంలోకి తెచ్చింది. అప్పటి నుంచి ఓటింగ్, కౌంటింగ్ సులభతరంగా మారింది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు కొన్ని వేల టన్నుల కాగితం అవసరమైంది. ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)ల రాకతో 15 ఏళ్లుగా ఆ భారం తప్పింది. అయితే 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారిగా ఈవీఎంలను ఉపయోగించారు. ఈ నెల 30న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలు తెలుసుకుందాం. – భద్రాచలం అర్బన్



- సులభంగా ఓటు నమోదు, లెక్కింపు
- వీవీప్యాట్, నోటా సౌకర్యాలూ అందుబాటులోకి..
- పారదర్శకంగా ఎన్నికల సంఘం సంస్కరణలు
- తొలుత 2009 సార్వత్రిక ఎన్నికల్లో వినియోగం

గరిష్ఠంగా 2 వేల ఓట్ల రికార్డు..

ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతోపాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్ వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్ఠంగా 2 వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ ఎన్నికల్లో సాధారణంగా 1500 ఓట్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటు రికార్డు..

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. దీనిలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తోపాటు వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ ఉంటుంది). బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణ చాలా సులభంగా ఉంటుంది. వీటికి విద్యుత్ సరఫరా అవసరం లేదు. సొంతంగా బ్యాటరీ/పవర్ ప్యాక్ సౌకర్యం ఉండటంతో విద్యుత్ సరఫరాలేని ప్రాంతాల్లో సైతం వీటిని వినియోగించవచ్చు.

బ్లూ బటన్ నొక్కగానే మెరుపు లైటు..

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌లో ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూ బటన్ నొక్కగానే ఎరుపురంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు 7 సెకన్ల పాటు కనిపించి డ్రాప్‌బాక్స్ పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

తొలుత మాక్ పోల్

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్ను నొక్కి అప్పటికే రికార్డైన ఓట్లేవీ నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్ బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు సీల్ వేస్తారు.

ఓట్ల సంఖ్య తెలుసుకోవచ్చు

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్ పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటివరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషిన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

స్ట్రాంగ్ రూంలో భద్రత

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. అభ్యర్థులు నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ వరకు ఈవీఎంలను 24 గంటలూ చూసేందుకు అనుమతిస్తారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీల్ వేస్తారు. కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూం తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు తర్వాత వీవీప్యాట్ స్లిప్పులను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

ఓటరు ఫిర్యాదు చేయవచ్చు

ఓటును నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్ కనిపించే పేపర్ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్ యంత్రంలో తర్వాత ఓట్ల నమోదును నిలిపివేసి రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్పులు, కంపార్ట్‌మెంట్ మెమరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వ్ మెషిన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్ యూనిట్ వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు.

జంగ్ తెలంగాణ

నైపుణ్యాలు మెరుగుపరిచేందుకే

సైన్స్ కాంగ్రెస్

- నూతన పరిశోధనలపై దృష్టి సారించాలి
- జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

ఖమ్మంసహకారనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడం.. శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మంలోని విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లాస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడారు.. విద్యార్థులు సమాజంలో తమ చుట్టూ ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. తద్వారా భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగొచ్చని తెలిపారు. ఇందుకోసం సైన్స్‌పై మరింత దృష్టి సారించి బట్టీ విధానంలో కాకుండా సృజనాత్మకతతో ఆలోచించడం అలవర్చుకోవాలని చెప్పారు. కాగా, సైన్స్ కాంగ్రెస్‌కు 70 మంది పేర్లు నమోదు చేసుకోగా, 68 మంది ప్రదర్శనలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి నాలుగు ప్రదర్శనలు ఎంపిక కాగా, విద్యార్థులకు డీఈఓ బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ కోఆర్డినేటర్ ఎనముల వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్, విన్‌ఫీల్డ్ హైస్కూల్ యాజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిశోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్, సైన్స్ రిసోర్స్‌పర్సన్స్ రంజిత్‌కుమార్, జక్కుల యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి నాలుగు ప్రదర్శనలు

జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో 68 ప్రదర్శనలు ఏర్పాటుచేయగా, నాలుగింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఆర్.అక్షిత బోదకాలు వ్యాధిపై అధ్యయనంతో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌తో పాటు హార్వెస్ట్ పాఠశాల విద్యార్థి ఈ.యశస్వి ప్రదర్శించిన సుసైడల్ వీడ్స్ (కలుపు మొక్కలు నాశనం చేసే మందు తయారీ), త్రివేణి పాఠశాల విద్యార్థి టి.డార్విన్ గ్రానైట్ వేస్ట్ వాటర్‌తో ఆవరణ వ్యవస్థకు జరిగే నష్టానికి పరిష్కార మార్గాలు, విన్‌ఫీల్డ్ హైస్కూల్ విద్యార్థిని ఏ.ఆశీర్లబీ హైజిన్ గో హెల్తీ(ఆరోగ్యం కోసం ఆరోగ్యంగా ఉండండి) పేరిట ప్రదర్శించిన ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విన్‌ఫీల్డ్ విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, అధికారులు



జల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు





హార్వెస్ట్, త్రివేణి పాఠశాలల విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, అధికారులు

రాష్ట్రంలో నిరంకుశ పాలన..

సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

ఖమ్మంమయూరిసెంటర్: అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కుల కోసం పోరాడే సంఘాలను నిషేధించి, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం కేసీఆర్ సమ్మెలను నిషేధించారని, సంఘాలు లేకుండా చేశారని ఆరోపించారు. కాగా, కనీస వేతన చట్టం ప్రకారం ఐదేళ్లకోసారి వేతనాలు సవరించాల్సి ఉన్నా కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకు అమలు చేయడం లేదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశాక రెండేళ్లకు కూడా బెనిఫిట్స్ అందడం లేదని, రాష్ట్రంలో నిరుద్యోగం పెరగగా.. కార్మికుల జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయని చెప్పారు. ఇలా నిరంకుశ పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ను అధికారం నుంచి దించడం ద్వారానే కార్మికుల హక్కులను కాపాడుకోగలమని వివరించారు. ఈ విషయాన్ని గుర్తించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయొద్దని కోరారు. సీపీఎం, సీపీఐ పోటీ చేస్తున్న స్థానాల్లో అభ్యర్థులను గెలిపించడమే కాక ఇతర చోట్ల వామపక్ష పార్టీల అభ్యర్థుల విజయానికి కార్మికులు కృషి చేయాలని సాయిబాబు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు జె.వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, కల్యాణం వెంకటేశ్వరరావు, రమ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'నా హత్యకు కుట్ర పన్నారు'

ఖమ్మంవన్‌టౌన్: రక్షణ లేకుండా చేసి తనను అంతం చేసే కుట్ర పన్నారని రిటైర్డ్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. ఖమ్మంలోని నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో చాలా ఏళ్లు తాను విధులు నిర్వర్తించానని తెలిపారు. అయితే, పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబంతో ఏళ్లుగా అనుబంధం ఉండగా, అజయ్ చేస్తున్న అభివృద్ధిని దగ్గరగా చూడడంతో కొనసాగింపుగానే ఆయనతో కలిసి నడవాలని వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నానని చెప్పారు. గత రాత్రి తాను ఇంట్లో ఉండగా పలువురు కాంగ్రెస్ నాయకులు వారి అనుచరులతో వచ్చి ఇంటిపై రాళ్ల దాడి చేశారన్నారు. దీంతో తాను పోలీసులకు సమాచారం ఇవ్వగా కాపాడారని తెలిపారు. ఇరవై రోజుల కిందట తుమ్మల నాగేశ్వరరావు ఫోన్‌చేసి అజయ్‌కు మద్దతు ఇస్తుండటంపై బెదిరించారని చెప్పారు. ప్రస్తుత దాడికి తుమ్మల నాగేశ్వరరావు, యుగంధర్ బాధ్యత వహించాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్లూరి జీవన్‌కుమార్‌తో పాటు చిన్ని కృష్ణారావు, బండారు శ్రీనివాస్, ప్రసాద్, బండారుపల్లి నవీన్‌కుమార్, దిలీప్‌చౌదరి, బిచ్చాల తిరుమల్‌రావు, గొల్లపూడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాష్‌చంద్రబోస్ తదితరులు

దాడి కేసు నమోదు..

ఖమ్మంఅర్బన్: రిటైర్డ్ అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు 100 మందికి పైగా మంగళవారం రాత్రి బోస్ ఇంటిపై దాడి చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రూ.3.74 లక్షలు సీజ్

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో చేపట్టిన వాహనాల తనిఖీల్లో పోలీసులు రూ.3,74,562 నగదు సీజ్ చేశారు. ముగ్గురు వ్యక్తులు ఈ నగదు తీసుకెళ్తుండగా, సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్ఐ ఎం.సురేశ్ తెలిపారు.

నగదు సీజ్

దమ్మపేట: మండలంలోని మందలపల్లి చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్న క్రమంలో ఆధారాలు లేకుండా కారులో తీసుకెళ్తున్న రూ.55 వేల నగదును అధికారులు గుర్తించారు. ఈ నగదును సీజ్ చేసినట్లు వెల్లడించారు.

అకాల వర్షంతో నష్టం

తల్లాడ: తల్లాడ మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షంతో రైతులకు నష్టం జరిగింది. మండలంలో వరి పైర్లు కోతకు రావడంతో కొందరు కోసి కల్లాల్లో ఆరబెట్టగా, మరికొందరు కోతలకు సిద్ధమయ్యారు. ఇంతలోనే వాతావరణం మారిపోయి వర్షం కురిసింది. దీంతో తల్లాడ, కిష్టాపురం, మంగాపురం, పినపాక, గొల్లగూడెం, గాంధీనగర్ తండా, నారాయణపురం గ్రామాల్లో వరి పైరు తడిసిందని రైతులు వెల్లడించారు. కోతకొచ్చిన వరి పైరుతో పాటు కోసిన ఆరబోసిన వడ్లు కూడా తడవడంతో నాణ్యత తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు వస్తుండడంతో రైతులు ధాన్యంపై పట్టాలు కప్పినా పెద్దగా ఫలితం కానరాలేదు. ఇక పత్తి తీసే దశలో వర్షం కురవడంతో పంట నాణ్యత కోల్పోతుందని చెబుతున్నారు.



ధాన్యంపై కప్పిన పట్టాలపై నిలిచిన నీరు

దంపతుల ఆత్మహత్యాయత్నం

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

ఖమ్మంక్రైం: కుటుంబంలో ఏర్పడిన మనస్పర్ధలు భార్యాభర్తల ప్రాణాల మీదకు తీసుకొచ్చాయి. క్షణికావేశంలో ఇద్దరూ పురుగులమందు తాగడంతో భర్త మృతి చెందగా.. భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఖమ్మంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం పార్శీబంధంకు చెందిన షేక్ బాబా (28)కు మూడేళ్ల కిందట సుభానీతో వివాహమైంది. మొదట వీరిద్దరూ బాగానే ఉన్నా.. తర్వాత కలహాలు మొదలై పెద్దవయ్యాయి. దీంతో ఇరువురికి పెద్దలు సర్దిచెప్పారు. ఖమ్మం మయూరిసెంటర్ ప్రాంతంలోని మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్‌లో పనిచేస్తున్న వీరిద్దరు మామిళ్లగూడెంలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం కూడా వీరి మధ్య గొడవ జరగగా, ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో బాబా బయటకు వెళ్లి పురుగులమందు తీసుకురావడంతో తాగారు. ఆ తర్వాత బాబా తన స్నేహితులకు ఫోన్ చేసి చెప్పడంతో వారువెళ్లే సరికి బాబా, సుభానీ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగానే బాబా మృతి చెందగా, సుభానీ చికిత్స పొందుతోంది. ఘటనపై మృతుడి తండ్రి సలీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ కుమారస్వామి తెలిపారు.



షేక్ బాబా (ఫైల్)

లారీ క్లీనర్ సజీవదహనం

- ఆగి ఉన్నఇసుక లారీని ఢీకొట్టిన ఇంకో లారీ
- గ్యాస్ సిలిండర్ పేలడంతో అంటుకున్న మంటలు



క్లీనర్ మృతదేహాన్ని కిందకు దించుతున్న అన్నం ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంక్రైం: లారీలో పడుకున్న క్లీనర్ నిద్రలోనే సజీవ దహనమయ్యాడు. ఇసుక లోడ్‌తో ఆగి ఉన్న ఇంకో లారీని ఢీకొనడంతో గ్యాస్ సిలిండర్ పేలి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం బైపాస్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కర్నూలుకు చెందిన లారీడ్రైవర్ ఈశ్వరుడు, క్లీనర్ గుర్రప్ప (27)తో కలిసి రాజమండ్రికి లోడ్‌తో బయలుదేరారు. లారీ బైపాస్‌రోడ్డు వాసిరెడ్డి ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకుంటున్న సమయాన ఇసుకలోడ్‌తో ఆగిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ క్యాబిన్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. క్యాబిన్‌లో నిద్రిస్తున్న క్లీనర్ గుర్రప్పతోపాటు డ్రైవర్ ఈశ్వరుడికీ మంటలు అంటుకోగా ఈశ్వరుడు మెలకువతో ఉండటంతో కిందకు దూకాడు. అయితే, నిద్రలో ఉన్న గుర్రప్ప బయటపడలేక ఆర్తనాదాలు చేస్తుండటంతో డ్రైవర్ వినతితో స్థానికులు ప్రయత్నించినా గుర్రప్ప మాడి మసైపోయాడు. ఖమ్మం టూటౌన్ పోలీసులు చేరుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పేశారు. అలాగే, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సిబ్బందితో చేరుకుని క్లీనర్ మృతదేహాన్ని కిందకుదించారు. కాగా, గాయాల పాలైన డ్రైవర్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రూ. లక్ష కోట్లు గంగపాలు

- సీఎం కేసీఆర్ హామీలన్నీ నీటి మూటలే..
- ఎన్నికల సభలో బీజేపీ నేత 'ఈటల'

ఇల్లెందు: తానే ఇంజనీర్‌నని, తన తెలివి తేటల ముందు అంతా బలాదూర్ అని ప్రకటించుకున్న కేసీఆర్ కలల సౌధం కాళేశ్వరం కూలి పోయిందని, కేంద్ర అధికారులు పరిశీలించి, ప్రాజెక్ట్ నిర్మాణంలో డిజైన్ లోపం ఉందని తేల్చారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గుర్తుచేశారు. దీంతో రూ. లక్ష కోట్ల ప్రజాధనం గంగపాలైందని విమర్శించారు. బుధవారం ఇల్లెందులోని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఇల్లెందు బీజేపీ అభ్యర్థి డి.రవీంద్ర నాయక్ గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి ఐకేపీ సెంటర్ల చుట్టూ తిరిగారని, నిద్రహారాలు మాని రైతులు పడిగాపులు కాస్తే వారి నోట్లో మట్టి కొట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆరోపించారు. ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీరందిస్తానని, ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ మాటలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రైతులతోపాటు రైతు కూలీలకు రూ.5 లక్షల బీమా, రూ. 10 లక్షల వరకు వైద్యం అందిస్తామని తెలిపారు. ఉద్యోగ నియామకాల క్యాలెండర్ ప్రకటిస్తామని వివరించారు. ఈమేరకు బీజేపీ అభ్యర్థి రవీంద్రనాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ సభలో నాయకులు బలగాని గోపీకృష్ణ, నాళ్ల సోమసుందర్, గుగులోతు రాంచందర్‌నాయక్, జర్పుల రాంచందర్, మురళీకృష్ణ, రంగాకిరణ్, సంజీవరెడ్డి, సురేంద్రనాయక్, హతీరాంనాయక్, పూన్యానాయక్, రుక్మారావు, శ్రీనివాసరావు, విమల్ జైన్, సంజీవరెడ్డి, భట్టు రమేష్, మావునూరి మాధవ్, మెంతెన వసంతరావు, శ్రీను, విజయలక్ష్మి, సుచిత్ర బాయి పాసీ, సునీత తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ఈటల రాజేందర్, అభ్యర్థి రవీంద్రనాయక్‌తో పాటు బీజేపీ నాయకులు